www.kalamjyothi.com

# కలంజ్యోతి

రేపటి కోసం

శుక్రవారం 14 మార్చి 2025



MD's Foreword

**Raghupathi Uppula**

10Th ANNIVERSARY CELEBRATION

USM SERVICES PVT. LTD.

DRIVE BUSINESS EASILY




USM SERVICES PRIVATE LIMITED

www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం శుక్రవారం 14 మార్చి 2025



- స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు
- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యే వరకు..
- సస్పెన్షన్‌పై బీఆర్ఎస్ సభ్యుల నిరసన

# జగదీష్‌రెడ్డి సస్పెన్షన్

2లో

### అసెంబ్లీలో ఏం జరిగింది..

తొలుత జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ సభ అందరిదని, సభ్యులందరికీ సమాన అవకాశాలు ఉన్నాయని అన్నారు. తమ అందరి తరఫున పెద్ద మనిషిగా, స్పీకర్‌గా మీరు కూర్చున్నారని తెలిపారు. ఈ సభ మీ సొంతం కాదని వ్యాఖ్యలు చేశారు. సభా సంప్రదాయాలకు విరుద్ధంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడారని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆక్షేపించారు. జగదీశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై అసెంబ్లీలో దుమారం రేగింది.

### క్షమాపణ చెప్పాల్సిందే..

జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం తెలిపారు. స్పీకర్‌ను దూషించేలా ఆయన మాట్లాడారని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. జగదీశ్‌రెడ్డి మాట్లాడిన ప్రతి పదాన్ని వెనక్కి తీసుకోవాలని, ఆయన అహంకారంతో మాట్లాడకుండా క్షమాపణ చెప్పాల్సిందేనని మంత్రి డిమాండ్ చేశారు.



2లో

# తెలంగాణలో 5 ఎమ్మెల్సీ స్థానాలు ఏకగ్రీవం




సప్తవర్ణాల కలయిక
ఒక్క తీరుగా రంగులలో
కలిసి మెలిసి పోయే సుదినం
జాతి, మత, కుల విష రంగులేవి
అంటని స్వచ్ఛమైన ప్రేమకు సంకేతం

రాధా మాధవుల వసంతోత్సవ
క్రీడలకు నిదర్శనం ...
తొలకరి జల్లుల వర్షంలో
తడిసి ముద్ద అయ్యే భావం

కాముడి దహనాల మధ్య
పౌర్ణమి వెలుగుల్లో
వెల్లువిరుస్తున్న స్నేహాలు
ఒకరికొకరు పంపుకునే ప్రేమ
సందేశాలతో నిండినది

ప్రాంతాలు వేరైనా
మనుషులు ఒక్కటే అంటూ
వెలిసిపోని మమతల
రంగులతో ముందుకు సాగాలి..

ఇప్పుడు
రంగులు ఎగిరే పక్షులాంటివి
కాలాలతో పాటుగా కొంచెం కొంచెం
ప్రపంచం మొత్తంగా చుట్టి వస్తు
శాంతి కపోతాలుగా
కొత్త పండుగతో ముందుకు వస్తున్నాయి



పాఠకులకు,
ప్రకటన కర్తలకు,
శ్రేయోభిలాషులకు,
బంధు మిత్రులకు
హోలీ శుభాకాంక్షలు

రమేష్ పెండ్యాల
ఎడిటర్, కలంజ్యోతి

# జగదీష్‌రెడ్డి సస్పెన్షన్

**కలంజ్యోతి, హైదరాబాద్ :**



తెలంగాణ అసెంబ్లీ నుంచి బీఆర్ ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ప్రకటించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని వెల్లడించారు. స్పీకర్ పట్ల వ్యాఖ్యలు చేసిన జగదీశ్‌రెడ్డి సభ్యత్వం రద్దు చేయాలని మంత్రి సీతక్క అసెంబ్లీలో ప్రతిపాదించారు. శాసన వ్యవస్థను అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల విషయాన్ని ఎథిక్స్ కమిటీకి పంపాలని అన్నారు. బడ్జెట్ సెషన్స్ ముగిసే వరకు జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేయాలని సభావ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆమోదం తెలిపారు.

**బీఆర్ఎస్ సభ్యుల నిరసన..**

ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై బీఆర్ఎస్ సభ్యుల నిరసన వ్యక్తం చేశారు. తాము మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ సభ్యుల పట్టు పట్టారు. శాసన సభ నుంచి మాత్రమే సస్పెండ్ చేశారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ ఛాంబర్‌లో కూర్చొన్న జగదీశ్‌రెడ్డి వద్దకు చీఫ్ మార్షల్ వచ్చి అసెంబ్లీ నుంచి వెళ్లిపోవాలని సూచించారు. శాసన సభ నుంచి మాత్రమే సస్పెండ్ చేశారని, ప్రతిపక్ష నేత ఛాంబర్‌లో కూర్చుంటే అభ్యంతరం ఏంటని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశ్నించారు.

**తప్పులేదు..**

బీఆర్ ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. జగదీశ్‌రెడ్డి ఏం తప్పు మాట్లాడారని హరీశ్‌రావు ప్రశ్నించారు. సభలో అందరికీ సమాన హక్కులు ఉన్నాయనడంలో తప్పులేదని అన్నారు. అసెంబ్లీ అంటే కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వానికి సంబంధించినది కాదని అన్నారు.



# తెలంగాణలో 5 ఎమ్మెల్సీ స్థానాలు ఏకగ్రీవం



## కాంగ్రెస్ నుంచి విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్
## బీఆర్ఎస్ నుంచి దాసోజు శ్రవణ్
## సీపీఐ నుంచి సత్యం

**కలంజ్యోతి, హైదరాబాద్ :** తెలంగాణలో జరగనున్న 5 ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఈ మేరకు ఎన్నికల అధికారులు అధికారిక ప్రకటన జారీ చేశారు. ఏకగ్రీవమైన ఎమ్మెల్సీలకు ధృవీకరణ పత్రాలు జారీ చేశారు. తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా విజయశాంతి, దాసోజు శ్రవణ్, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, సత్యం నామినేషన్లు దాఖలు చేశారు. వీరితో పాటు మరో ఆరుగురు నామినేషన్లు దాఖలు చేయగా.. నామినేషన్లు సరిగా దాఖలు చేయని కారణంగా అవి తిరస్కరించబడ్డాయి. దీంతో ఈ ఐదుగురు ఏకగ్రీవం అయ్యారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేల సంఖ్యాబలం ఆధారంగా కాంగ్రెస్ కు 4 స్థానాలు రాగా.. వాటిలో ఒకటి పొత్తులో భాగంగా సీపీఐకి కేటాయించింది. ఫలితంగా కాంగ్రెస్ నుంచి విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్ లు.. సీపీఐ నుంచి సత్యం నామినేషన్ వేశారు. బీఆర్ఎస్ కు ఒక స్థానం రాగా.. ఆ పార్టీ నుంచి దాసోజు శ్రావణ నామినేషన్ దాఖలు చేశారు. కాగా.. వీరంతా ఏకగ్రీవం అయినట్టు ఈసీ ప్రకటించింది.

# హోలీ ప్రశాంత జరుపుకోవాలి



## ఎస్పీ మహేష్ బి.గితే

**కలంజ్యోతి, రాజన్న సిరిసిల్ల :**

హోలీ వేడుకలను ప్రశాంత వాతావరణంలో , సురక్షితంగా జరుపుకోవాలని రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం,పరిచయం లేని వ్యక్తులపై రంగులు జల్లడం ,బలవంతంగా రంగులు చల్లిన, గొడవలు సృష్టించిన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోలీ వేడుకల సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. యువకులు అత్యుత్సాహం ప్రదర్శింస్తూ ద్విచక్ర వాహనాలపై ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఇబ్బందులకు గురి చేసిన , చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని మైనర్ డ్రైవింగ్ చేసే వారిని పట్టుకుని వాహన యజమానులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. హోలీ వేడుకలు ముగిసిన తరువాత స్నానాల కోసం అధిక నీటి ప్రవాహం, లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాల బారిన పడవద్దు అని సూచించారు. పండుగ వేళ ఇతరులపై బలవంతంగా రంగులు వేసిన, గొడవలు పడినా, అసత్య ప్రచారం చేసినా, ఇతరుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, మహిళలను వేదింపులకు గురిచేసిన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందని, తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలి అని ఎస్పి విజ్ఞప్తి చేశారు.



# రేషన్ బియ్యం పట్టివేత

- సరఫరా చేస్తే కఠిన చర్యలు
- ముల్కనూర్ ఎస్సై సాయిబాబు

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** మండలంలోని కొప్పూర్ గ్రామంలోని గంగిరెద్దుల కాలనీలో అక్రమంగా సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ముల్కనూర్ ఎస్సై సాయిబాబు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. బత్తుల రాజయ్య దగ్గర నుండి 15 క్వింటాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మండలంలో అక్రమంగా ఎవరైనా రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తే వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోబడును అని ఎస్సై సాయిబాబు హెచ్చరించారు.



# సీఎంవి మతిలేని మాటలు

## సిద్ధం వేణు, పల్లె నర్సింహారెడ్డి

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** తెలంగాణ ఉద్యమ నేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి మతిలేని మాటలు మాట్లాడొద్దని రాజన్న సిరిసిల్ల జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఈ రోజు ముఖ్యమంత్రి గా ఉన్నారంటే కేసీఆర్ పెట్టిన భిక్ష అన్నారు. నాడు కేసీఆర్ చావు నోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, పదేళ్ల పాటు దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని సీఎంగా కేసీఆర్ అగ్రగామిలో నిలిపారని అన్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమ సమయంలో చంద్రబాబు బూట్లు మోసి ఉద్యమాన్ని అణచివేయాలని చూశారని, కానీ కేసీఆర్ ఎత్తిన జెండా, బిగించిన పిడికిలి వదలకుండా తెలంగాణ కోసం పోరాడిన యోధుడన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలనలో రైతులకు యూరియా బస్తాలు దొరకడం లేదన్నారు. రేవంత్ రెడ్డి కుట్ర రాజకీయాల కారణంగా కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీళ్లివ్వకుండా యాసంగి సీజన్ లో పంటలు ఎండబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల బతుకుల్లో మార్పు తెస్తాం... రైతులను రాజులను చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి మార్పు పేరుతో ప్రజల బ్రతుకుల్లో మట్టిపోశాడని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి చేష్టల వల్ల కాంగ్రెస్ పార్టీ కాలగర్భంలో మునిగిపోతుందని 15 నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే నావలా తయారైందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మతిలేని మాటలు మాట్లాడుతూ పిల్లచేష్టలు చేస్తున్నాడని, తెలంగాణ రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేక గాలిమాటలు మాట్లాడుతున్నారని, తెలంగాణ లో ఇప్పుడు ఎన్నికలు వచ్చిన కాంగ్రెస్ పతనం తప్పదని అన్నారు. కార్యక్రమంలో ఎండీ సాదుల్, కూస నరేష్, కూనబోయిన రఘు, సత్యం, దొంతుల శంకర్ లింగం, మహేష్, మధు, నాగుల సాయిప్రసాద్, జనార్దన్, ప్రశాంత్, ప్రేమ్ పాల్గొన్నారు.

# డ్రైవింగ్ కోర్సులలో ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

## జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ.పురుషోత్తంనాయక్

**కలంజ్యోతి, మంచిర్యాల :** జిల్లాలోని వెనుకబడిన తరగతుల యువతీ, యువకులకు డ్రైవింగ్ కోర్సులలో ఉచితంగా శిక్షణ అందించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ. పురుషోత్తం నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ హైదరాబాద్ ద్వారా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థహకీంపేట, హైదరాబాద్ నుండి హెచ్ఎంవీ, ఎల్ఎంవీ డ్రైవింగ్ కోర్సులలో ఉచిత శిక్షణ అందించడం జరుగుతుందని, 38 రోజుల శిక్షణ పూర్తి అయిన తరువాత సంబంధిత రవాణా సంస్థ అర్హత కలిగిన అభ్యర్థులకు పర్మనెంట్ లైసెన్స్ ఉచితంగా అందిస్తుందని, హకీంపేటలోని టీఏ అండ్ జెడ్ఎస్ టీసీ (టీజీఆర్ టీసీ) ద్వారా అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యం అందించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఎల్ఎంవీ కోసం 1845 సంవత్సరాలు, హెచ్ఎంవీ కోసం 2045 సంవత్సరాల వయస్సు ఉండి, 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండి, ఆధార్కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, పాస్ పోర్ట్ ఫొటోలతో జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఎఫ్5లో గల జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో ఈ నెల 15వ తేదీ నుండి 31వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయ పనివేళలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# గుణాత్మక విద్యను అందించాలి

## కలెక్టర్ కుమార్ దీపక్



**కలంజ్యోతి, మంచిర్యాల :** ప్రభుత్వ పాఠశాలలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు విలువలు కలిగిన గుణాత్మక విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయం, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, వంట శాల, హాజరు పట్టిక, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల లో విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు సమన్వయం తో కృషి చేయాలని తెలిపారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులకు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలకు సన్నద్ధం చేయాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన మెనూ ప్రకారం సకాలంలో విద్యార్థులకు పౌష్టికాహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వేసవికాలంలో వడదెబ్బకు గురి కాకుండా పాటించవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులు పఠనా సామర్థ్యాలను పరీక్షించి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా కామ దహన వేడుకలు



**కలంజ్యోతి, జగిత్యాల :** రంగుల పండుగ హోలీని జిల్లాలో నిర్వహించేందుకు చిన్నా పెద్ద సిద్ధమయ్యారు. గ్రీష్మరుతువు ఆరంభంలో, వసంత రుతువు చివరలో ఫాల్గుణ మాసం పౌర్ణమినాడు కామదహనం చేసి మరుసటి రోజు రంగులు చల్లుకొని హోలీ నిర్వహించడం ఆనవాయి తీ. గత మూడు రోజుల నుంచే పిల్లలు, మహిళలు కాముడి ఆట ఆడుతూ అలరించారు. గురువారం రాత్రి కామదహనాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లో స్థానిక యువత ఊరేగింపులు నిర్వహించి కట్టెలు, పిడకలు తదితర సామగ్రి పోగు చేసి చౌరస్తాల్లో కామదహనం నిర్వహించారు. సంప్రదాయ రీతిలో పూజలు చేశారు. అలాగే శుక్రవారం హోలీ వేడుకలకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. వసంత రుతువుకు గుర్తుగా, హిందువుల పురాణ విశ్వాసాల మేరకు హోలీని సంబురంగా జరుపుకోనున్నారు. రంగులను చల్లుకుంటూ వేడుకల్లో మునిగి తేలేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే సహజ రంగులు మాత్ర మే వా డాలని, హాని చేసే రసాయన రంగులకు దూ రంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. రంజాన్ మాసం కొనసాగుతున్న నేపథ్యంలో పోలీసు లు జిల్లా అంతటా ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేశా రు. జిల్లా కేంద్రంలో టవర్ సర్కిల్ వద్ద హిందూ వాహిని ఆధ్వర్యంలో కామ దహనం, వాణి నగర్ లో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో మరియు వివిధ చౌరస్తాలో కామ దహనం చేసి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



## మధురలో హోలీ సంబురాలు

**కలంజ్యోతి, నర్సాపూర్ : హత్నూర మండల పరిధిలోని మధుర గ్రామంలో మాజీ సర్పంచ్ మాధవినవీన్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులందరూ ఘనంగా హోలీ జరుపుకున్నారు. ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకొని ఆనందంతో చిందులు వేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.**





# కామ దహనం

కలంజ్యోతి, జగిత్యాల : జిల్లా కేంద్రంలోని శ్రీశక్తి గణేష్ సర్కిల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కామ దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులతో పాటు మహిళ కిట్టి పార్టీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం కామ దహన కార్యక్రమంలో భాగంగా సమిధులను ఒకచోట పేర్చి.. పాత వస్తువులను అందులో వేశారు.. సాంప్రదాయలతో కాముని పాటలకు మహిళ.. శ్రీ శక్తి గణేష్ సర్కిల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆనందంగా నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వాణినికేతన్ హై స్కూల్‌లో హోలీ వేడుకలు

**కలంజ్యోతి. ఇల్లంతకుంట :** మండల కేంద్రంలోని వాణినికేతన్ హైస్కూల్ లో హోలీ వేడుకలు జరిగాయి. పాఠశాల ఆవరణలో గురువారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు ఒకరికొకరు రంగులు పులుముకొని అభినందనలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ హోలీ అనేది భారతీయ సాంస్కృతి, సాంప్రదాయాలలో లోతుగా పాతుకపోయినా ఒక శక్తివంతమైన పండుగ అన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రత్యేకగా హోలీ పండుగ జరుపుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరి జీవితాలు రంగుల మయమై ఆనందంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనిధి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.






# ఎస్ఆర్ కే స్కూల్లో హోలీ వేడుకలు

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** ముందస్తు హోలీ సంబరాలు మండలంలోని ముల్కనూర్ గ్రామంలోని ఎస్ఆర్ కే ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముందస్తుగా ఆనందోత్సవాల నడుమ హోలీ సంబరాలు గురువారం నిర్వహించారు . విద్యార్థులు ఉపాధ్యాయులు హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని ఆనందం వ్యక్తం చేశారు. సప్తవర్ణాల వేడుక హోలీని చిన్నా పెద్దా తేడాలేకుండా రంగులు చేతపట్టుకొని ఒకరిపై ఒకరు చల్లుకునున్నారు. పాటలు పాడుతూ, ఆటలాడుతూ, నృత్యాలు చేస్తూ జరుపుకున్నారు. కాగా, కెమికల్ కలర్స్‌కు బదులు సహజ సిద్ధ రంగులు వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రిన్సిపల్ కాశిరెడ్డి ఆదిరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ అండ్ కరస్పాండెంట్ కాశిరెడ్డి ఆదిరెడ్డి, ఉపాధ్యాయులు కవిత, మహేశ్వరి, శృతి, అస్మ, లావణ్య, జి. అశ్విని, ప్రవళిక, రామకృష్ణ, ఏ.అశ్విని విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

- ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా మే నెల మొత్తం సెలవులు ఇచ్చి టీహెచ్ఆర్‌కు అనుమతి ఇవ్వాలి
- 65 సంవత్సరాలు పైబడిన ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి
- అనారోగ్యంతో బాధపడుతున్న వారికి రిటైర్మెంట్ కి అవకాశం కల్పించాలి
- పోషణ్ ట్రాకర్, ఎన్‌హెచ్‌టీఎస్ రెండింటికీ ఒకే యాప్ ఉండాలి
- అంగన్ వాడీలకు బకాయిపడిన బిల్లులు వెంటనే చెల్లించాలి

# అంగన్‌వాడీలకు మే నెల సెలవు ప్రకటించాలి

**అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (బీఆర్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి**

**కలంజ్యోతి, హైదరాబాద్ :** అంగన్వాడీ కేంద్రాలకు ఒక పూట సెలవు తో పాటు మే నెలలో సెలవులు ఇచ్చి టీహెచ్ ఆర్ కు అనుమతి ఇవ్వాలని కోరుతూ తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (బీఆర్ టీయూ ) రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి నేతృత్వంలో ప్రతినిధి బృందం గురువారం మహిళాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనితా రాంచంద్రన్, కమిషనర్ కాంతి వెస్లీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నల్లా భారతి మాట్లాడుతూ కేంద్రాలు పూర్వ ప్రాథమిక విద్య కేంద్రాలుగా నడుస్తున్నాయి అని, ప్రభుత్వ పాఠశాలలతో పాటు అంగన్వాడీ కేంద్రాలకు ఒక పూట బడి నిర్వహించాలన్నారు. ప్రతి సంవత్సరం మే నెలలో అంగన్వాడీ టీచర్ కు 15 రోజులు ఆయాకు 15 రోజులు సెలవులు ఇస్తారని ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా మే నెల మొత్తం సెలవులు ఇచ్చి టీహెచ్ ఆర్ కు అనుమతి ఇవ్వాలని కోరారు. 65 సంవత్సరాలు పైబడిన అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ 2024 జులై నెల నుండి విధులకు హాజరు కాకుండా ఉన్నారన్నారు. జులై నెలలో మంత్రి ఇచ్చిన మాట ప్రకారం టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉద్యోగం చేయలేని పరిస్థితిలో ఉన్న వారికి కూడా రిటైర్మెంట్ కి అవకాశం ఇచ్చి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో రిటైర్మెంట్ బెనిఫిట్స్ తో పాటు వేతన పెంపునకు సంబంధించి బడ్జెట్ కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో పోషణ్ ట్రాకర్, ఎన్ హెచ్ టీఎస్ రెండు యాప్ ల ద్వారా ఒకే రకమైన సేవలను ఆన్లైన్ చేయాల్సి వస్తుందని, ఒకే యాప్ ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఈవెంట్స్ డబ్బులు, పెండింగ్ ఇంటి అద్దెలు, కూరగాయల బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ సమస్యలతో కూడిన వినతి పత్రాలు మహిళా అభివృద్ధి స్త్రీ సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేషీలో డిమాండ్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి, ప్రధాన కార్యదర్శి వి.రమాతార, కోశాధికారి వేదవతి, రాష్ట్ర నాయకులు ఎల్లమ్మ, రేణుక, రజిత పాల్గొన్నారు.







# డఫోడిల్స్‌లో అంబరాన్నంటిన హోలీ సంబరాలు





**కలంజ్యోతి, నర్సంపేట :** జీవితాల్లో ఆనందాన్ని నింపడమే హోలీ పండుగ ప్రత్యేకత అని డఫోడిల్స్ (సి.బి.ఎస్.ఈ ) పాఠశాల కరస్పాండెంట్ చింతల నరెందర్ అన్నారు. గురువారం నర్సంపేట పట్టణానికి చెందిన డఫోడిల్స్ సి.బి.యస్.ఈ పాఠశాలలో ఘనంగా ముందస్తుగా హోలీ వేసుకులను కరస్పాండెంట్ చింతల నరెందర్ ఆదేశాల అనుసరం పాఠశాల ఇంచార్జ్ శశికల ఆధ్వర్యంలో అంబరాన్నంటిన హోలీ సంబరాలు చిన్నారులు తమ స్నేహితులు, ఉపాధ్యాయులకు రంగులను చల్లుతూ ఒకరికి ఒకరు హోలి శుభాకాంక్షలు తెలుపుకుంటూ తమ స్వచ్ఛమైన మనస్సుతో ఆనంద తన్మయత్వం చెందారు. చిరునవ్వులను చిందిస్తూ రంగేళిని ఎంతో ఉత్సాహంగా కేరింతల నడుమ జరుపుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతల నరెందర్ మాట్లాడుతూ.. రంగులతో ఆడుకుంటూ ఆనందించే ఏకైక పండుగ హోలీ అని హోలీ పండుగను కాముని దహనం అని కూడా అంటారని, హోలి పండుగ దేశంలో అత్యంత వేడుకగా జరుపుకునే పండుగలలో ఇది ఒకటి అన్నారు. ఈ పండుగ సత్యయుగం నాటి నుంచి జరుపుకుంటున్నారంటూ, హిందు పురాణాల ప్రకారం హోలీ అనగా అగ్నితో పునీతమైనదంటూ మనలోని చెడు కోరికలను దహింప చేసుకొని, సమాజ హితాన్ని కోరుతూ మతసామరస్యాన్ని పెంపొందింప జేసుకోవాలంటూ,అనారోగ్యం కలిగించే రసాయానిక రంగులు చల్లుకోవద్దని , సహజ సిద్ధమైన పసుపు, కుంకుమ రంగులను చల్లుకోని సంప్రదాయ పద్ధతుల్లో హోళీ జరుపుకుందామని పిలుపునిస్తూ.హోలీ పండుగ ఐక్యతకు ప్రతీక అని పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించి అందరికి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమం లో పాఠశాల సెక్రటరీ సాయి కీర్తన రోహిత్ , ప్రధానోపాధ్యాయులు అజీముద్దీన్, ఉప ప్రధానోపాధ్యాయులు సి. హెచ్ రీటా,హెచ్. ఆర్. డి విజయలక్ష్మి ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.